



తుంగభద్ర జలాశయం

నిబంధనలు తుంగలో..

వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ అక్రమాలు కారణంగా దశాబ్దాలుగా కొనసాగుతున్న తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు అకౌంట్ ఫ్రీజ్ చేసే పరిస్థితికి వెళ్లింది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో జరిగిన అవినీతి కారణంగా ఏకంగా బోర్డు ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోయాయి. బోర్డులో పని చేస్తున్న దాదాపు 600 మంది ఉద్యోగులు, ఇంజనీర్లు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు, పింఛన్‌దారులు రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి రావడానికి దారితీసిన కారణాలు ఏమిటి? కూపి లాగితే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ ప్రయోజనం, స్వలాభం కోసం 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీబీపీ బోర్డు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. జీవో నంబరు.45కు విరుద్ధంగా టెండర్లు పిలవడమే కాకుండా ఏకంగా నిబంధనలు తుంగలో కలిపేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వైసీపీ హయాంలో పని చేసిన ఓ ఈఎన్‌సీ, అదే సమయంలో బోర్డులో పని చేసిన ఓ ఉన్నత ఇంజనీరింగ్ అధికారి పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)తో విచారణ చేయిస్తే.. ఐదేళ్లలో టీబీపీ బోర్డులో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



హొళగుంద మండలంలో చేసిన ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

టెండర్లలో మాయ చేసి దోచేశారు!

టీబీపీ బోర్డు నిర్వహణ, మరమ్మతులు, ఆధునికీకరణ పనుల కోసం ప్లానింగ్, నాన్ ప్లానింగ్ గ్రాంట్స్ రూపంలో ఏటేటా ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తుంది. ఓటింగ్ చేసిన బడ్జెట్ కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా టెండర్లు పిలవరాదని జీవో నంబరు.45 స్పష్టంగా చెబుతుందని, బోర్డు ఏర్పాటు నుంచి ఆ ఉత్తర్వులు మేరకు టెండర్లు పిలుస్తూ వచ్చారని ఓ ఇంజనీరు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కారు. బడ్జెట్‌లో ఓటింగ్ గ్రాంట్‌కు విరుద్ధంగా కాలువల మోడర్నైజేషన్‌లో భాగంగా తొలి దశలో 2022 మార్చిలో ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులకు రూ.519.80 కోట్లు, రెండవ దశలో 2023 జనవరిలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాలువల లైనింగ్ పనులకు రూ.400 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏపీ ప్రభుత్వం గ్రాంట్ ఇవ్వకుండానే దాదాపు రూ.920 కోట్లకు టెండర్లు ఎలా పిలుస్తారు..? అనే ప్రశ్నలు వెల్లువెత్తాయి. అయితే వైసీపీ హయాంలో బోర్డు సభ్యుడుగా ఉన్న ఈఎన్‌సీ అధికారి ఒకరు ప్రభుత్వం నుంచి అడిషినల్ గ్రాంట్ మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం, అదే అంశాన్ని ఏపీ బోర్డు మెంబరు అష్యూర్డ్ ఇవ్వడంతో అదనపు నిధులతో టెండర్లు పిలిచేందుకు బోర్డు సమావేశంలో తీర్మానం చేయించారని బోర్డు ఇంజనీరు ఒకరు తెలిపారు. కేవలం ధనాపేక్ష, స్వప్రయోజనాల కోసం ఎంతో తెలివిగా బోర్డునే తప్పుదోవ పట్టించి నిబంధనలు తుంగలో తొక్కారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీని వెనుక బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చడంతో పాటు గతంలో బోర్డులో పని చేసిన కొందరు ఇంజనీరింగ్ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించారని తెలుస్తోంది.

- జీవో నంబరు 45కు విరుద్ధంగా టెండర్లు
- 'వైసీపీ' కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం..
- టీబీపీ బోర్డునే తప్పుదోవ పట్టించారు
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- ఓ ఈఎన్‌సీ పాత్రపై అనుమానం

కర్నూలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయసీమ జీవనాడి తుంగభద్ర జలాశయం. కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాల్వ (ఎల్లెల్సీ) పరిధిలో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలకు, అనంతపురం, కడప జిల్లాల్లో టీబీపీ హెచ్చెల్సీ కాలువ కింద 2,84,992 ఎకరాలు, కేసీ కాలువ కింద ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి ఏపీ వాటాగా 66.50 టీఎంసీలు కేడబ్ల్యూడీటీ-2 కేటాయించింది. ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాల కోసం టీబీపీ బోర్డును 1953లో ఏర్పాటు చేశారు. తుంగభద్ర డ్యాం సహా ఎల్లెల్సీ కాలువ 0/0 నుంచి 241 కిలోమీటర్లు వరకు, హెచ్చెల్సీ కాలువ 0/0 నుంచి 135 కి.మీలు వరకు టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉంది. బోర్డు పాలకవర్గంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఎస్ఈ స్థాయి అధికారి సెక్రెటరీగా, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హోదా కలిగిన ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఈఎన్‌సీ హోదా అధికారులు సభ్యులుగా ఉంటారు. తుంగభద్ర డ్యాం, కాలువలు నిర్వహణ, మరమ్మతులు, ఆధునికీకరణ, ఉద్యోగుల జీతాలు కోసం ఏపీ ప్రభుత్వం 65 శాతం, కర్ణాటక ప్రభుత్వం 35 శాతం నిధులు సమకూరుస్తుంది. ముందుగా ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు కేటాయిస్తుంది. ఆ తరువాత కర్ణాటక ఇవ్వాల్సిన వాటా నిధులు సర్దుబాటు చేస్తుందని ఇంజనీర్లు అంటున్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే బోర్డు సమావేశంలో తీసుకునే నిర్ణయాలే అమలు చేయాలి. స్వయంప్రతిపత్తి కలిగిన తుంగభద్ర బోర్డును సైతం వైసీపీ ఆయాంలో ఒకరిద్దరు కాంట్రాక్టర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, కొందరు ఇంజనీరింగ్ అధికారుల ధనాపేక్ష, స్వార్థప్రయోజనాల కోసం భ్రష్టుపట్టించారనే ఆరోపణలు లేకపోలేదు. వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ అక్రమాలు వల్ల బోర్డు బోర్డు ఖాతా కార్యకలాపాలే ఆగిపోయాయంటే బోర్డులో రాజకీయ జోక్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తుంది.

మిగతా 6లో..

పిన్నాపురం అసైన్డ్ భూముల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టరు

పాణ్యం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నాపురంలో సోలార్‌కు కేటాయించిన భూములను నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి పరిశీలించారు. శనివారం ఆమె సోలార్ పరిశ్రమకు కేటాయించాల్సిన 276 ఎకరాల అసైన్డ్ భూముల ధరల మార్కెట్ విలువలపై చర్చించారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పరిశ్రమకు కేటాయించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సోలార్ పరిశ్రమ ఏరియల్ మ్యాపులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విశ్వనాథ్, పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, డీటీ శివశంకర్, ఆర్ఐ రాము, వీఆర్వో నాయుడు, సర్వేయరు నాగరాజు, సోలార్ ప్రాజెక్ట్ పీడీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- సాగు నీటి రంగానికి నిధులు కేటాయించాలి
- రాయలసీమ హక్కుల దినోత్సవంలో వక్తల డిమాండ్

నంద్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అన్నారు. రాయలసీమకు హక్కులను కల్పిస్తూ 1937 నవంబరు 16న శ్రీబాగ్ ఒడంబడికను రూపొందించిన సందర్భంగా లాయర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన నంద్యాలలోని భగీరథ సమావేశ మందిరంలో రాయలసీమ హక్కుల దినోత్సవాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎన్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ హక్కుల పత్రమైన శ్రీబాగ్ ఒడంబడిక జరిగి 87 సంవత్సరాలు పూర్తయినప్పటికీ కీలక అంశాలైన కృష్ణా, తుంగభద్ర నదీజలాల ప్రథమ ప్రాధాన్యత, పాలనా వికేంద్రీకరణలో భాగంగా రాజధాని, హైకోర్టు వంటి హామీలను నేటికీ ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాయలసీమ వివక్షకు గురవుతోందన్నారు. భారత రాజ్యాంగం, ఏపీ రాష్ట్ర విభజన చట్టం కూడా రాయలసీమకు హక్కులను కల్పించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాయలసీమ సాగునీటి రంగానికి బడ్జెట్‌లో 42శాతం నిధులు కేటాయించారని, ఒప్పందంలోని హక్కులను పాలకులు గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఏజీఎం శివనాగిరెడ్డి, రైతు నాయకులు బాలీశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి, సమితి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సమితి ప్రతినిధులు, రైతులు

ఫైళ్ల భద్రతకు డిజిటలైజేషన్

జిల్లా న్యాయాధికారి కబర్ది



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్ది

నంద్యాల క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లోని ఫైళ్లను భద్రపరిచేందుకు న్యాయశాఖ డిజిటలైజేషన్‌ను చేపట్టినట్లు జిల్లా న్యాయాధికారి కబర్ది తెలిపారు. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన సముదాయంలోని పలు కోర్టులను ఆయన తనిఖీ చేశారు. కోర్టులోని ఫైళ్లను పరిశీలించారు. అనంతరం నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. న్యాయాధికారి కబర్ది మాట్లాడుతూ నంద్యాల న్యాయవాదులు విన్నవించిన విన్నపాలను తనవంతుగా త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. న్యాయవాదులకు ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. త్వరలో నంద్యాలలో జిల్లా కోర్టు, ఫ్యామిలీ కోర్టు, మరో ఎన్ఐ యాక్ట్ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అదనంగా రెండు కోర్టులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. న్యాయవాదులు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకునేందుకు సహకరించాలని సూచించారు. కోర్టులో మౌలిక వసతుల కల్పన, ఆవరణలో వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి వాసు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి, రెండవ అదనపు జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి కిరణ్‌కుమార్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.దుర్గాప్రసాద్, భూమావెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సింగరి జీవన్‌రాజ్, ద్వారక, విజయశేఖరరెడ్డి, వనం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన ఓంకార్

నంద్యాల, నవంబరు 16 : (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కె.వి. ఓంకార్ జాతీయ స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవేంద్రగౌడ్ శనివారం తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీ క్రికెట్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఓంకార్ ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి మ్యాచ్‌లో 55 పరుగులు, రెండో మ్యాచ్‌లో 88 పరుగులు, మూడో మ్యాచ్‌లో 27 పరుగులు సాధించి ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టుకు ఓంకార్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓంకార్‌ను నందిపైప్స్ ఎండి సుజల, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు అభినందించారు.

ఉల్లి పంటకు ప్రీమియం చెల్లించండి

నంద్యాల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే ప్రధానమైన ఉల్లి పంటకు బీమా పథకం కింద రైతులు ప్రీమియం చెల్లించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు కోరారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల, ఏదైనా విపత్తుల వల్ల నష్టాలు కలిగినప్పుడు ఉల్లి రైతును ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఇందులో భాగంగా ఎకరాకు 45000 వేల విలువగల మొత్తంలో ఉల్లి సాగు రైతులు రూ.90 చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రీమియం చెల్లింపునకు డిసెంబరు 18వ తేది వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రీమియం చెల్లింపు ఇతర వివరాలకు సమీపంలోని రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

లింగాలగట్టు వాసులకు మహర్దశ

- ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే బుడ్డా చొరవ
- అధికారులతో కలెక్టర్ రాజకుమారి సమావేశం

నంద్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని లింగాలగట్టు వాసులకు మహర్దశ కలగనుంది. దాదాపు 30 ఏళ్లకు పైగా అక్కడ ఉండి, చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్న వారికోసం కూటమి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సానుకూలంగా ఉంది. దీనిపైన నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఇరిగేషన్, ఫారెస్టు, ఫిషరీస్, రెవెన్యూ సంబంధిత అధికారులతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీశైలం డ్యాం కిందనున్న లింగాలగట్టులో దాదాపు 442 కుటుంబాలకు చెందిన సుమారు 2 వేల మంది నివాసం ఉంటున్నారు. వీరంతా ఒంగోలు మార్కాపురం, వైజాగ్ ప్రాంతం నుంచి దశాబ్దాల క్రితం ఇక్కడకు వచ్చి చేపల వేటతో జీవిస్తున్నారు. అయితే వీరు నివాసం ఉంటున్న ప్రాంతమంతా అటవీ శాఖ పరిధిలోకి వస్తుంది. కాబట్టి ఈ భూములకు పట్టాలు ఇవ్వడానికి కుదరలేదు. గత ప్రభుత్వాలు కూడా వీరిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో వీరికి శాశ్వత నివాసం ప్రశ్నార్థకమైంది. కూటమి ప్రభుత్వం రాగానే శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి లింగాలగట్టు వాసులకు పట్టాలు ఇప్పించేందుకు పూనుకున్నారు. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం చంద్రబాబు వీరికి పట్టాలు ఇచ్చే విషయమై ఆరా తీయమంటూ జిల్లా అధికారిని ఆదేశించారు. దీంతో కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి లింగాలగట్టు వాసులకు సంబంధించిన పూర్వాపరాలతో పాటు మిగిలిన వివరాలను వారంలోగా అందజేయాలని ఆదేశించారు.

ఇంకెన్నాళ్లు..?



జిల్లా ట్రెజరీ కార్యాలయం

- కాంట్రాక్టు అధ్యాపకులకు వేతన బకాయిలు
- 2019లో మూడు నెలల శాలరీ పెండింగ్

నంద్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఐదేళ్లవుతున్నా నేటికీ దక్కలేదు. అధికారులు చేసిన తప్పిదాలకు కాంట్రాక్ట్ అధ్యాపకులు వేతనాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019 ఏప్రిల్, మే, జూన్ నెలల పెండింగ్ రోజులకు సంబంధించి జీతాలు ఇచ్చే విషయంలో చిన్న పొరపాటు జరిగింది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఒక్కొక్కరు దాదాపు రూ.62 వేలను కోల్పోయారు. ఈ మొత్తం పెండింగ్ రోజుల జీతాన్ని తమకు అందేలా చూడాలంటూ ఐదేళ్ల నుంచి వారు పోరాడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు అందించాలని కోరుతున్నారు. రాయలసీమ పరిధిలోని జోన్-4లో దాదాపు 296 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉండగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 90 మంది ఉన్నారు. ఆయా ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధన చేసేందుకు కాంట్రాక్టు పద్ధతిన ప్రభుత్వం వీరిని నియమిస్తుంది. ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియను చేపడుతూ మరుసటి సంవత్సరం వీరి కాంట్రాక్టును పునురుద్ధరిస్తూ ఉంటుంది. ఈ పద్ధతిలో కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల జీతం (10 రోజుల విరామంతో) జీతం చెల్లిస్తుంది. పది రోజులు విరామమిచ్చి మళ్లీ మరుసటి ఏడాదికి కాంట్రాక్టును పునరుద్ధరిస్తుంది. కానీ 2019 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ పెండింగ్ రోజులకు సంబంధించిన వేతనాలు కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులు దక్కించుకోగా, మరికొంతమందికి అందలేదు. వేతనాలు దక్కని కాంట్రాక్టు అధ్యాపకులు తమ పరిస్థితికి కారణమేమిటని ఆరా తీశారు. అప్పటి ప్రభుత్వం వెలువరించిన జీవోల్లో స్పష్టత లేకపోవటంతో జీతాలు చెల్లించలేదని సంబంధిత ట్రెజరీ అధికారులు చెప్పుకొచ్చారు.

స్పష్టత లేకపోవటంతో..

సాధారణంగా ప్రభుత్వ శాఖ అయినా, ప్రైవేటు కంపెనీ అయినా ఆ ఏడాది ఏప్రిల్ నుంచి మరుసటి ఏడాది మార్చి వరకు ఆర్థిక సంవత్సరాన్ని పాటిస్తాయి. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో రెండు సంవత్సరాల్లోని పన్నెండు నెలలు ఉంటాయి. ఉదాహరణకు గత ఏడాది ఆర్థిక సంవత్సరం అని ఎవరైనా పేర్కొన్నాలి వస్తే 2023-24 అని రాస్తారు. అంటే 2023వ సంవ్సరంలోని ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఉన్న 9 నెలలు, 2024వ సంవత్సరంలోని జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు మూడు నెలలను కలిసి 2023-24 ఆర్థిక సంవత్సరంగా పేర్కొంటారు. కానీ విద్యాశాఖలో ఆర్థిక సంవత్సరం అని కాకుండా విద్యా సంవత్సరం అని పేర్కొంటారు. దీని ప్రకారం విద్యా సంవత్సరం జూన్ నుంచి మొదలై మే నెలతో ముగుస్తుంది. కాంట్రాక్టు అధ్యాపకుల నియమకాలను విద్యాశాఖ ప్రాతిపాదికన సంబంధిత శాఖ చేపడుతుంది. కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించి 12 నెలల జీతం (10 రోజుల విరామంతో) చెల్లించేలా 2019 సంవత్సరంలో ప్రభుత్వం జీవోఆర్టీ నెం:187, జీవోఎంస్ నంబరు 12ను విడుదల చేసింది. ఈ జీవోల్లో కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించి జీతాలు చెల్లింపు విషయమై చిన్న పొరపాటు జరిగిందన్నది ట్రెజరీ అధికారుల వాదన. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని 12 మంది కాంట్రాక్టు లెక్చరర్లకు 2019 ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెండిగ్ రోజులకు జీతాలు అందలేదు.



మిగతా 6లో..

'బెల్టు' పెట్టుకోండి..!

ఆదోనిలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

7

న్యాయ సంస్థల తరలింపు సరికాదు

వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ బిందుమాధవ్

6

కోర్కెలు తీర్చే కొత్తూరు

- భక్తుల కొంగుబంగారంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
- ఆదివారం మాంసం ముట్టని గ్రామం
- కార్తీక మాసంలో రద్దీ.. ● స్థలం కొరతతో ఇబ్బందులు

ఆలయం



స్వామివారి మూల విరాట్

పాణ్యం, నవంబరు16(ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలుగొందుతున్నాడు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కొలిచే భక్తులకు సంతాన ప్రాప్తి, సకల కోర్కెలు తీరుతాయన్న నమ్మకం. సుమారు 290 సంవత్సరాల క్రితం కొత్తూరు గ్రామానికి చెందిన బీరం చెన్నారెడ్డి అనే రైతు మాఘ శుద్ధ షష్టినాడు తన పొలంలో సేద్యం చేస్తుండగా నాగలికి స్వామి విగ్రహం తగిలి రైతుతోపాటు ఎద్దులు స్పృహతప్పి పడిపోయారని చెబుతారు. కొద్ది సేపటి తర్వాత స్పృహ నుంచి తేరుకున్న చెన్నారెడ్డి నాగలిని ఎత్తి చూడగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం కనిపించిందని, దీంతో వెంటనే చెన్నారెడ్డి సమీప గ్రామంలోని పెద్దలను పిలుచుకొని మేళతాళాలతో వెళ్లి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిపినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. నాటి నుంచి నేటి వరకు స్వామి భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు. ఆలయంలో స్వామివారు ఎండకు, వానకు తడుస్తూ ఉండడం విశేషం. దేవాలయానికి ఎటువంటి మాన్యం లేకపోయినా భక్తుల విరాళాలు, సహకారంతో దినదినా భివృద్ధి చెందుతోందని ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు.

కొత్త ఊరే కొత్తూరు : కొత్తూరు ఏర్పడక ముందు రెండు కిలో మీటర్ల దూరంలోని గగ్గటూరు బీరం వంశీకుల నివాసం. ప్రస్తుత కొత్తూరు ప్రాంతం వ్యవసాయ భూమి. స్వామి అవతరణతో గగ్గటూరు గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు స్వామివారి చుట్టూ నివాసమేర్పరచుకొని జీవించేవారు. ఈ నివాసాలను కొత్తవూరుగా పిలవబడి రానురాను గ్రామం క్రమేపి కొత్తూరు సుబ్బరాయునిగా మారింది. గ్రామంలో అధిక శాతం మంది పేర్లు సుబ్బరాయునిగానే ఉండడం విశేషం. స్వామివారు ఆదివారం మాఘశుద్ధ షష్టి నాడు అవతరించడంతో కొత్తూరు గ్రామం ప్రజలు ఆదివారం మాంసాహారం ముట్టరు. ఆదివారం కనీసం గుడ్డు కూడా ముట్టకపోవడం ఈ గ్రామం ప్రత్యేకత.



ఆలయ గాలిగోపురం

కార్తీక మాసంలో భక్తుల రద్దీ

ప్రతి యేటా కార్తీక మాసంలో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారు. కార్తీక మాసం ఆదివారంలో దాదాపు 20 నుంచి 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఆలయం ఆధ్వర్యంలో ప్రతి ఆది, మంగళవారాలు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఆదివారం రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుంటుంటారు.

వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు : కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. స్వామివారి షష్టి సందర్భంగా వేకువజాము నుంచే రుద్రాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే క్యూలైన్, దర్శనం నిర్వహణ తదితర కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

దర్శనానికి వెళ్లాలంటే ఇబ్బందులు

ఆలయానికి అవసరమైన స్థలం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే రూ. కోటి 20 లక్షల భక్తుల విరాళాలతో చేపట్టిన ఆలయ మహా ప్రకారం, క్యూలైన్ కాంప్లెక్స్ పనులు పూర్తికావచ్చాయి. అన్నదానం కార్యక్రమానికి సరైన సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ పరిధిలో ఇప్పటికే దాదాపు 70 గదులు, కళ్యాణ మండపం, కళ్యాణకట్ట, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు నిలపడానికి స్థలం లేక ప్రైవేటు స్థలంలో నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది.



తప్పు చేస్తే తప్పించుకోలేరు

తప్పు చేసిన వారు స్వామివారి నుంచి తప్పించుకో లేరు. ఆదివారం గ్రామంలో ప్రజలు ఎంతో నిష్ఠతో స్వామివారిని పూజిస్తారు. స్వామివారు అవతరించడంతోనే ఈ గ్రామం ఏర్పడింది. ప్రతి మంగళవారం రాహుకేతు పూజలు నిర్వహించి భక్తుల జీవితాల్లో వెలుగు నింపుతున్నాం.

- నాగపుల్లయ్య శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారి బి.వెంకటలక్ష్మమ్మ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత డీఎస్సీ కోచింగ్ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పి.వెంకట లక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానిక అబ్బాస్ నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ భవనంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ స్వర్ణయుగమన్నారు. ఈ శిక్షణ 60 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణకు హాజరైన అభ్యర్థులకు స్టయిఫండ్ మంజూరు చేస్తామని చెప్పారు. సెంటర్ గ్రంథాలయంలో పరీక్షలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా అభ్యర్థులకు స్థానికంగా వసతి కల్పిస్తామని తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ అభ్యర్థులు సమయాన్ని వృథా చేయరాదన్నారు. నలుగురు,ఐదుగురు గ్రూపుగా ఏర్పడి ఒకరికొకరు చర్చించుకోవాలని సూచించారు. కో ఆర్డినేటర్ భాస్కర్, ఫ్యాకల్టీ, అభ్యర్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. శనివారం జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లను స్మార్ట్‌గా వినియోగించుకోవాలని, ఇతర అవసరాలకు వాడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. ఇంటర్‌నెట్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబూ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్‌లు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరావు, సీఐలు ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. శనివారం నగరంలోని పలు ట్రాఫిక్ కూడళ్లను ఎస్పీ పరిశీలించారు. సీ క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, గాయత్రి ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు, సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలపై ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు పలు సూచనలు చేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉపాధి కల్పన అధికారి పి. దీప్తి



సమావేశంలో మాట్లాడుతున్న పి.దీప్తి

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి పి. దీప్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్ర పటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాలు ఆనాడు విద్యావ్యవస్థ పురోభివృద్ధికి తోడ్పడ్డాయని, పాఠశాలలతో పాటూ గ్రంథాలయాలు విద్యావ్యాప్తిలో భాగస్వామ్యం అయ్యాయని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం బాగా అలవాటు చేసుకోవాలని, మంచి పుస్తకాలు విజ్ఞానంతోపాటు సామాజిక వికాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర, విశ్రాంత భూగర్భ వనరుల ఇంజనీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, చిత్రలేఖన అధ్యాపకుడు బీడీ సుధీర్‌రాజు, ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్. బాషా, మక్బుల్ బాషా, గ్రంథాలయ ఉద్యోగులు చంద్రమ్మ, నసీమా, రేణుక, శ్రీనివాసులు, భాస్కర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు, చిత్రలేఖనం పోటీలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు పాఠకులను ఆకట్టుకున్నాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుమారు 200మంది పైగా విద్యార్థులు వివిధ పోటీలకు హాజరయ్యారు.

రాయపాటి శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం



కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ బ్రెజిల్ దేశం నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రశంసాపత్రం అందుకున్నారు. బ్రెజిల్ దేశంలోని ది లాస్ట్ ట్రంపెట్ మిషన్ థియలాజికల్ ఇన్‌స్టిట్యూట్, ఇంటర్నేషనల్ ఐటీఎంయూటీ యూనివర్సిటీ డైరెక్టర్ జార్జ్ జీసస్ట్ శనివారం అంతర్జాలం ద్వారా ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గత పది దశాబ్దాలుగా లయన్స్ క్లబ్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీల ద్వారా అందిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలపై స్పందించి ఆ సంస్థ ఈ ప్రశంసాపత్రాన్ని ప్రకటించి అందజేసిందని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రశంసాపత్రం మరింత స్ఫూర్తినిచ్చిందని, భవిష్యత్తులోనూ పేద వర్గాలకు సేవలు కొనసాగించేలా ప్రేరణ కల్పించిందని ఆయన తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

గోదాములను తనిఖీ చేసిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ

కర్నూలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శనివారం నగరంలోని ఎ. క్యాంపులో ఉన్న ప్రజా పంపిణీ నిత్యావసర సరుకుల ఎంఎల్ఎస్ గోదాములను ఆయన తనిఖీ చేశారు. గోడౌన్ ఇన్‌చార్జి నాగమణితో వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. 2023 ఫిబ్రవరి నుంచి సీజ్ చేసిన 194 మెట్రిక్ టన్నుల బియ్యం రికార్డులు పరిశీలించి వీటిపై త్వరలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గత వైసీపీ హయాంలో పేదల బియ్యం పంపిణీలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని అన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలియజేశారు.



సివిల్ సప్లయ్ గోదామును పరిశీలిస్తున్న కొంగతి లక్ష్మీనారాయణ

ఇంకెన్నాళ్లు..?

(5వ పేజి తరువాయి)

కళాశాల ఉన్నత విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 154 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. 2019-20 సంవత్సరానికి సంబంధించిన జీతాల చెల్లింపు విషయమై గందరగోళం కొనసాగుతున్న సమయంలోనే దాదాపు 90 కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు చెల్లింపులు జరిగిపోయాయి. మిగిలిన వారికి జీతాలు చెల్లించటంలో జిల్లా ట్రెజరీ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శించారు. ఇలా జీతాలు తీసుకోని ఉమ్మడి జిల్లా కాంట్రాక్టు లెక్చరర్లు విసిగిపోయి తమ పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ డీటీఏ (డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్) శాఖకు మొర పెట్టుకున్నారు. అసలు విషయం ఏమిటి? ఎందుకు నంద్యాల ట్రెజరీ అధికారులు జీతాలు పెండింగ్‌లో పెట్టారు? అనే విషయంపై డీటీఏ అప్పట్లో ఆరా తీసింది. జీవోల్లో 2019-20 విద్యా సంవత్సరం అనేది, 2019 ఏప్రిల్, మే నెలలకు వర్తించదని, 2018-19 విద్యా సంవత్సరం అని ఉంటే జీతాలు చెల్లించటంలో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని, అయినా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ శాతం మంది కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు చెల్లించారు కాబట్టి, మిగిలిన వారికి కూడా చెల్లించవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. జిల్లా ట్రెజరీ అధికారులు మాత్రం జీవోఆర్టీ నెం:187, జీవోఎంస్ నంబరు 12లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, దీనివల్ల పెండింగ్ రోజుల జీతం బకాయిలను చెల్లించలేమని స్పష్టం చేశారు. వీరి తీరువల్ల ఇన్నేళ్ళ నుంచి కాంట్రాక్టు లెక్చరర్లు 2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ జీతాలు అందుకోవటంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

రికవరీ చేయాలంటూ ఆదేశాలిచ్చినా..

తమకు పెండింగ్ వేతనాలు ఇవ్వని పక్షంలో అప్పటికే శాలరీ తీసుకున్న కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని, లేదా వారికి వేతనాలు ఎలా ఇచ్చారో, తమకు కూడా ఇవ్వాలని కోరారు. దీనిపైన స్పందించిన అప్పటి డీటీఏ 2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ రోజులకు చెల్లించిన వేతన సొమ్మును కాంట్రాక్టు లెక్చరర్ల నుంచి రికవరీ చేయాలంటూ నంద్యాల జిల్లా డీటీఓ, ఎస్టీఓ ట్రెజరీ అధికారులకు 2020 నుంచి 2022 సంవత్సరాల మధ్యలో మూడు మార్లు మెమోలు జారీ చేశారు. దీంతో నంద్యాల డీటీఓ జీతాలు రికవరీ చేయాలని 2023 ఫిబ్రవరిలో ఆయా ఎస్టీఓలకు అప్పట్లో ఉత్తర్వులు ఇచ్చారు. అయినా జీతాలు రికవరీ కాకపోవటంతో డీటీఏ మరోమారు 2023 అక్టోబరులో జిల్లా ట్రెజరీ అధికారులకు మెమో ఇచ్చారు. దీంతో కొంతమంది ఎస్టీఓలు వేతనాలను రికవరీ చేసేందుకు పూనుకున్నా, నంద్యాల జిల్లాలోని యర్రగుంట్ల కళాశాలలో తప్పించి మిగతా ఎక్కడా కూడా వేతనం రికవరీ కాలేదు. మరి మిగిలిన వారి నుంచి జీతాలు ఎందుకు రికవరీ చేయలేదని డీటీఓతో పాటు మిగిలిన ఎస్టీఓ ట్రెజరీ అధికారులను కాంట్రాక్టు లెక్చరర్లను ప్రశ్నిస్తున్నారు. దీనిపైన సంబంధిత అధికారులు ఎలాంటి సమాధానమివ్వటం లేదు.

నిబంధనల ప్రకారమే చెల్లించాం

2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ జీతాలను అడుగుతున్న వారి విషయంలో అప్పటి ప్రభుత్వ జీవో ప్రకారమే నడుచుకున్నాం. కానీ కాంట్రాక్టు లెక్చరర్లు జీవో వచ్చిన విద్యా సంవత్సరానికి సంబంధించినవి కాకుండా, అంతకుముందు సంవత్సరానికి సంబంధించిన జీతాలను అడుగుతున్నారు. అలా ఇవ్వడం కుదరదు. కొంతమంది కాంట్రాక్టు లెక్చరర్లకు అప్పటి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు పడ్డాయి. వీటిని తిరిగి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే వాటిని కూడా రికవరీ చేస్తాం. జీతాలు రాలేదని చెబుతున్న కాంట్రాక్టు లెక్చరర్లకు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేశాం.

- లక్ష్మీదేవి, జిల్లా ట్రెజరీ అధికారి, నంద్యాల

నిబంధనలు తుంగలో..

(5వ పేజి తరువాయి)

'తుంగ'లో టెండరు నిబంధనలు

● తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కర్ణాటక పరిధిలో 121 కి.మీల వద్ద హగరినదిపై 56 పిల్లర్లతో అక్విడక్ట్ నిర్మించారు. 2022 అక్టోబరులో హగరి (వేదవతి) వరద ఉధృతికి ఒక పిల్లరు కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతు పనులు బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దాదాపు రూ.15 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.40 కోట్లతో శాశ్వత మరమ్మతు పనులకు 2022 డిసెంబరు 13న టెండర్లు పిలిచారు. ఆ కాంట్రాక్టర్‌కు వంతెన నిర్మాణాల అనుభవం లేకపోవడంతో టీబీపీ బోర్డు ఇంజనీర్లు జీఓ-67 ప్రకారం జాయింట్ వెంచర్‌కు అనుమతి ఇచ్చారు. సింగిల్ టెండరు షెడ్యూల్ రావడంతో ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. 2023 జనవరిలో దాదాపు రూ.400 కోట్లతో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లైనింగ్ పనులకు పిలిచిన టెండర్లతో జాయింట్ వెంచర్ నిబంధన తొలగించారు. కేవలం వైసీపీ కాంట్రాక్టర్ ప్రయోజనం కోసమే ఇలా చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చాడు. ఆ తరువాత ఆ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి స్టే ఎత్తివేయించినట్లు తెలుస్తుంది.


● తొలి దశలో ప్యాకేజీ-11 కింద రూ.61.26 కోట్లతో ఎల్లెల్సీ 10.00 కి.మీల నుంచి 18.600 కి.మీల వరకు కెనాల్ సెక్షన్, సీసీ లైనింగ్ పనులకు టెండర్లు పిలిచారు. అర్హత కలిగిన ఏ కాంట్రాక్టరు అయినా ఆన్‌లైన్ టెండరు షెడ్యూల్ వేయవచ్చు. ఆ కొండ రాళ్లు కాలువలో పడకుండా గ్రౌటింగ్, షాట్‌క్రీటింగ్ పనులు చేసే టెండరు నిబంధనలు సవరించారు. ఆ పనుల్లో అనుభవం కలిగిన కాంట్రాక్టరు ఒక్కరే టెండరు వేశారు. ఈ నిబంధనల ప్రకారం కొండరాళ్ల మధ్య రంధ్రాలను పూడ్చేందుకు 5 ఎంపీఏ, 2 ఎంపీఏ పవర్‌తో సిమెంట్ గ్రౌండింగ్ పనులు, సిమెంట్, ఇసుక మిశ్రమాన్ని వపర్ గన్‌తో సీసీ లైనింగ్ చేసే షార్ట్‌క్రీటింగ్ చేయాలి. టెండర్లు ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రౌటింగ్, షార్ట్‌క్రీటింగ్ అవసరం లేదని, కెనాల్ సెక్షన్, సీసీ లైనింగ్ పనులు చాలంటూ వర్క్ మోడిఫికేషన్ (పని సవరణ) చేశారు. ఆ ప్రకారమే బిల్లులు చేశారని తెలుస్తుంది. కాంట్రాక్టర్ ప్రయోజనం అడ్డంగా నిబంధనలు మార్చేసి బోర్డునే భ్రష్టుపట్టించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



హొళగుంద మండలంలో చేసిన ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ చేయిస్తే..

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధమైన సంస్థ కావడంతో.. కాలువలు మోడ్రనైజేషన్ కోసం ఏపీ ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఆ పనుల్లో నాణ్యతాప్రమాణాలపై తనిఖీ ఏపీ ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ తనిఖీ చేసే అధికారం లేదు. దీంతో బోర్డులో పని చేసే ఇంజనీరింగ్ అధికారులు కొందరు, కాంట్రాక్టర్లు, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ముఖ్య నాయకులు కుమ్మక్కై నిబంధనలు, నాణ్యతాప్రమాణాలు తుంగలో కలిపేసి అడ్డంగా దోపిడి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ చేయిస్తే గత వైసీపీ హయాంలో సాగించిన అవినీతి అక్రమాల గుట్టు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది వైసీపీ హయాంలో జరిగిన మరమ్మతులు, ఆధునికీకరణ పనుల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



తుంగభద్ర జలాశయం

న్యాయ సంస్థల తరలింపు సరికాదు

• వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి జిల్లా నుంచి న్యాయ సంస్థల తరలింపును వైసీపీ వ్యతిరేకిస్తోందని కర్నూలు, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. న్యాయ సంస్థలను అమరావతికి తరలించకూడదని న్యాయవాదులతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నుంచి జ్యుడీషియల్ సంస్థను తరలించాలన్న టీడీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతో కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించారని, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి పునాదితో పాటు హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు వంటి సంస్థలు ఏర్పాటు అయ్యాయని వారు వివరించారు. ఈ సంస్థలను మార్చాలని కోరుతూ హైకోర్టులో టీడీపీ ప్రభుత్వం చేసిన అఫిడవిట్ దాఖలు చేయడమంటే శ్రీబాగ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే న్యాయపరమైన అవకాశాలను అన్వేషిస్తామని, ప్రజా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. అన్ని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ బీవై.రామయ్య, కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, నారాయణరెడ్డి, సోంపల్లి క్రిష్ణకాంత్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైసీపీవి స్వార్థ రాజకీయాలు

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులవి స్వార్థ రాజకీయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొజ్జమ్మ నియామకంపై వైసీపీ పలు రకాలుగా దుష్ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకులు కలిసి కట్టుగా పని చేసి పార్టీని జిల్లాలో గెలిపించారని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే కప్పట్రాళ్ల బొజ్జమ్మను బోయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా నియమించినట్లు తెలిపారు. ఆమె తండ్రి కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు తెలుగుదేశం పార్టీలో కీలకమైన నాయకుడిగా సేవలందించారని అన్నారు. జిల్లాలో బీసీలకు ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేగా పార్టీ అవకాశాలు కల్పించిందని తెలిపారు.

21న ఎక్సైజ్ డిపోలో ఫర్నీచర్ వేలం

కర్నూలు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ విభాగంలోని ఐఎంఎల్ డిపోలో ఫర్నీచర్‌ను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని మేనేజర్ శ్రీధర్ రావు తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రిజర్స్-93, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ - 96, క్యాష్ చెస్ట్-86, స్కానర్స్-192, క్యాష్‌కౌంటింగ్ మిషన్స్-74 వీటికి సంబంధించి వేలం ప్రక్రియలో పాల్గొన దలచిన వారు ముందుగా రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్‌ను ఏపీఎస్‌బీడీసీఎల్ డిపోను సంప్రదించాలని కోరారు.

ఆస్తి కోసం కన్న తల్లిపై కొడుకు దాడి

• ప్రభుత్వాసుపత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న పార్వతి

ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కన్న తల్లిపైనే కొడుకు దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఆదోని పట్టణంలోని విక్టోరియా పేటలో పార్వతికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు నాగరాజు జల్సాలకు అలవాటు పడ్డాడు. తాగుడుకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో పనులు కోసం బెంగళూరుకు వెళ్లాడు. పార్వతికి తల్లిదండ్రుల నుంచి రెండు ఇళ్లు ఆస్తిలో భాగంగా వచ్చాయి. ఆ ఇళ్లను బాడుగకు ఇచ్చి ప్రభుత్వం ఇస్తున్న పించను సహాయంతో జీవనం సాగిస్తోంది. ప్రస్తుతం కూతురు దగ్గర ఉంటోంది. ఇల్లు తన పేరున చేయించాలని పార్వతిపై కొడుకు నాగరాజు ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో శుక్రవారం తల్లిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయాలకు గురైన పార్వతిని స్థానికులు, బంధువులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జాతీయ క్రీడాకారులను తయారు చేద్దాం

• పీఈటీలకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపు



పీఈటీలతో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, అక్టోబరు 16: విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తయారు చేద్దామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆర్ అండ్‌బీ వసతి గృహంలో డీఎస్పీ వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహిద్దామన్నారు. వివిధ రకాల క్రీడల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డోన్ క్రీడాకారులు పేరు తెచ్చేలా తయారు చేయాలని పిలుపునిచ్చారు. క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా తమ వంతు సహకారాలు అందిస్తానన్నారు. త్వరలోనే కబడ్డీ, షటిల్ కోర్టులను అందుబాటులోకి తెస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో ప్రభాకర్, జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చంద్రమౌళి, పీఈటీలు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

కోసిగి నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోసిగి సర్కిల్ కార్యాలయంలో నలుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇప్పటి వరకు ఏడుగురు మట్కా డాన్‌లను రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. మట్కా బీటర్ల నుంచి 705 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు మట్కా చీటీలు రూ.2,7300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండురోజుల్లోనే కోసిగి మండల కేంద్రంలోని మట్కా రాయుళ్లపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

'బెల్టు' పెట్టుకోండి..!

ఊరూరా తిరిగి బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నా అందుకు భిన్నంగా ఆదోని నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోకి మద్యం వ్యాపారులు వెళ్లి గతంలో ఎవరెవరు గొలుసు దుకాణాలు నిర్వహించారో వారంతా మళ్లీ మద్యం అమ్మాలంటూ ప్రోత్సహిస్తున్నారు. ఎంత సరుకు కావాలన్నా ఇస్తామని, పోలీసులతో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా దగ్గరుండి పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ పల్లెలను మద్యంతో నాశనం చేస్తున్నారు.

అర్ధరాత్రి వరకు..

తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉంటోంది. ఒక్కో గ్రామంలో రెండు కంటే ఎక్కువ బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఆదోని నియోజకవర్గంలోని 44 గ్రామ పంచాయతీల్లో దాదాపు వంద వరకు బెల్టు దుకాణాలు ఉన్నాయి. రోజు ఒక్కో దుకాణంలో 100 నుంచి 150 వరకు మద్యం సీసాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టు షాపులో 150కి దొరికే మద్యం అదనంగా 30 నుంచి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యాపారం సాగుతోంది.

పోలీసులకు దొరికితే పండగే

గ్రామాల్లో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వారు పోలీసులకు దొరికితే పండుగ చేసుకుంటున్నారు. అందిన కాడికి దోచుకోవడమే కాకుండా అక్కడ ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు తిరిగి నిర్వాహకుడుపై కేసు నమోదు చేస్తున్నారు. వారం రోజులు క్రితం ఆదోని మండలంలో ఓ గ్రామంలో మద్యం పట్టుబడింది. దొరికిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మద్యం మాత్రం బహిర్గతం చేయకుండా ఎంతో కొంత మొత్తాన్ని తీసుకొని మళ్లీ వాళ్లకే అప్పు చెబుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇటీవల ఆదోని డివిజన్‌లో ఓ ఎస్సై మద్యం దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేశాడు.

25 వేల రూపాయలు తీసుకొని వదిలిపెట్టకుండా తిరిగి అతనిపైనే కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో బెల్ట్ షాపు నిర్వాహకులు పోలీసులపై తిరగబడే పరిస్థితి నెలకొంది. లంచం తీసుకున్నా కేసులు పెట్టడంపై ఆదోని కూటమికి చెందిన బడా నేత దగ్గరకు వెళ్లి తమ గోడును వెల్లబోసు కున్నట్లు సమాచారం. త్వరలో ఎస్పీని కలిసి ఈ విషయాన్ని వివరిస్తామని హెచ్చరిస్తు న్నట్లు తెలుస్తోంది.

సిండికేట్‌గా మారి

ఆదోని నియోజకవర్గంలో 12 మద్యం దుకాణాలన్నాయి. విడివిడిగా ఉంటే గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు, సరుకు సరఫరాకు ఇబ్బందులు వస్తాయని వ్యాపారులు సిండికేట్‌గా మారారు. దీని ద్వారా ఏ గ్రామంలోని గొలుసు దుకాణా నికైనా.. ఏ దుకాణం నుంచైనా మద్యాన్ని తీసుకువెళ్లవచ్చంటున్నారు. దీంతోపాటు వ్యాపారులు ఒక్కో బెల్టు దుకాణం యజమాని నుంచి డిపాజిట్‌గా రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాల్లో వారి అనుచరులకే దుకాణాలు కేటాయించాలంటూ మండల గ్రామ స్థాయి నాయకులు వ్యాపారులకు సిఫార్సు చేస్తుండడం గమనార్హం.

ఉపేక్షించేది లేదు..

గ్రామాలు, పట్టణంలో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. ఇప్పటి వరకు ఏడు కేసులు నమోదు చేశాను. ఎక్కడైనా నిర్వహిస్తే సమాచారాన్ని ఇవ్వండి. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. **- సైదుల్లా, ఎక్సైజ్ సీఐ, ఆదోని**



బెల్టు దుకాణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

దిన్నెదేవరపాడు వీఆర్వో మృతి



నివాళులర్పిస్తున్న తహసీల్దార్

కర్నూలు రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామ వీఆర్వో-2 వి.వెంకటేశ్వర్లు(54) మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవారు. శనివారం ఆరోగ్యం క్షీణించడంలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీఆర్వోకు భార్య ఒక కూతురు ఉంది. విషయం తెలుసుకున్న రూరల్ తహసీల్దార్ టి.వెంకటరమేష్‌బాబు వీఆర్వో స్వస్థలం కర్నూలు రూరల్ మండలం నిడ్జూరు గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వం తరుపున దహన సంస్కారాల కోసం తహసీల్దార్ రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. వీఆర్వోలు బోయ మద్దిలేటి, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, దస్తగిరి,నాగరాజు, మల్లేశ్వరి,నాగలక్ష్మీ, రాఘవేంద్ర, శరభరాజు, వీఆర్ఏలు కురువ శ్రీనివాసులు, వెంకటేశ్లరు, గోవిందు నివాళి అర్పించారు.

నంద్యాల చెక్‌పోస్టు వద్ద రోడ్ల విస్తరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్ పోస్టు నుంచి నందికొట్కూరు వెళ్లే దారిలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడుతున్నట్లు నగర పాలక అధికారులు స్పష్టం చేశారు. దీనికి కార్పొరేషన్‌తో పాటు ఆర్‌అండ్‌బీ శాఖతో జిల్లా ఉన్నతాధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్ డైరెక్టర్‌కు నగర పాలక కమిషనర్ లేఖ రాశారు. ఇటీవల నగర పాలకలో జరిగిన కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. మాస్టారు ప్లాన్‌లో ఆమోదించిన ప్రకారంగానే 120 అడుగుల రోడ్డు అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేసినట్లు కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్(ఆర్‌అండ్‌బీ) అథారిటీస్ మంజూరు చేసే నిధులు పోగా మిగిలిన నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఆర్‌అండ్‌బీఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

చిన్నారిపై అత్యాచార యత్నం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారిపై చాగలమర్రిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అత్యాచారయత్నం చేశారు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో యూకేజీ చదివే చిన్నారిపై అదే పాఠశాలలో పదో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకు చిన్నారి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి



మృతి చెందిన నాగరాజు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై శనివారం ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందాడు. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన నాగరాజు (23) మరో వ్యక్తితో కలిసి ఆటోలో కడప జిల్లాలోని మైదుకూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి ఆళ్లగడ్డకు బయలుదేరారు. పెద్దబోధనం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నాగరాజు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు గురైన మహిళ మృతి



అనసూయ(ఫైల్)

హొళగుంద, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి గ్రామానికి చెందిన కురువ అనసూయ(32) చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం పొలం పనులు చేస్తుండగా భారీ వర్షాలతో పాటు పిడుగు పడడంతో అనసూయ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. భర్త కుబేరస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు.

చెంచుల సమస్యలపై రేపు వినతుల స్వీకరణ

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చెంచు గిరిజనుల సమస్యలపై గ్రీవెన్స్ డే ద్వారా వినతులను స్వీకరించనున్నట్లు శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని అన్ని చెంచుగూడేలకు చెందిన గిరిజనుల సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని వెల్లడించారు.

బత్తలపల్లి రోడ్డు ప్రమాదంలో ఆదోని వాసి మృతి



మృతి చెందిన అనిల్

ఆదోని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోనికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. బత్తలపల్లి-అనంతపురం రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అనిల్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఆదోనికి చెందిన నిత్యానంద్ కుమారుడు అనిల్‌కుమార్ గత పది రోజుల నుంచి కనిపించలేదు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం వాహనదారులు గుర్తించి బత్తలపల్లి మండల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి చేతుల మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పంపించారు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

CHANGE OF NAME

I, **JAFFAR** (OLD NAME)R/O H NO: 46/163-26-34, Budhwarapeta,Kurnool Dist,A.P ,have changed my name as **SHAIK JAFFAR** (NEW NAME) S/O SHAIK BABBAR SAHEB AJL-202748

CHANGE OF NAME

I, **BASAVANA GOWD APARNA** W/O. TAMMANNA VARU BASAVANA GOWD (Old Name) HNO No:401, SHILPA PRIDE GANDHI NAGAR YEMMIGAUR -518360, KURNOOL Dist, AP. Hereby State That I Have Changed My Name known as **BASAVNA GOUD APARNA** Wo. BASVANA GOUD TAMMANNAVARU (New Name) AJL-195688

CHANGE OF NAME

I, **CHOWDARY NAZIMA** (Old Name) R/o.H.No:66/89, Naidu street, Opp:Shadaan school, kurnool dist, AP., have changed my name as **CHOWDARY NAZIM BEGUM** (New Name) W/o. CHOWDARY HAJI BASHA AJL-202960

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647** AJA- 198468

DENTAL

రేడియంట్ డెంటల్ క్లీనిక్: అన్ని రకాల దంతం నోటి సంబంధిత వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS ద్వార ప్రభుత్వ ఉద్యోగులకు, క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ కలదు. సంప్ర ఎన్.ఆర్.పేట : **93900 40088.** గాయత్రి ఎస్టేట్స్ : **86886 61622.** చెన్నమ్మ సర్కిల్ :**85002 26655**, కర్నూలు. AJL-202577

TO-LET

కర్నూలు వెంకటరమణ కాలనీ రోడ్ నెం.2 మెయిన్ రోడ్‌కు అన్నివసతులతో వున్న బిల్డింగ్, ఆఫీసులకు కొచింగ్ సెంటరుకు, బ్యాంక్‌లకు అనుకులం. వెంటనే సంప్రదించండి. సెల్ : **94906 41127** AJL-202953

EDUCATION

Open 10th కట్టిన విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో 4 నెలలు శిక్షణ. ఎమ్మిగనూరు, కర్నూలు బ్రాంచీలలో **.Cell: 9985923345, 9963256300.** AJL-195685

EDUCATION

4,5 తరగతులు చదువుచున్న గ్రామీణ మరియు పట్టణ విద్యార్థులకు గురుకుల, మోడల్ స్కూలు ఎంట్రన్స్ కొరకు లాంగ్ టర్మ్ కోచింగ్, ఎమ్మిగనూరు, కర్నూలు బ్రాంచీలలో **.Cell: 9985923345, 9963256300.** AJL-195685

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

కారు బోల్తా.. జవాన్‌కు తీవ్ర గాయాలు



బోల్తా పడ్డ కారు

ఆత్మకూరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో కర్నూలు-గుంటూరు రహదారిపై కారు బోల్తా పడటంతో ధర్మారెడ్డి అనే ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. కురుకుంద గ్రామానికి చెందిన ధర్మారెడ్డి తన కుమారుడు రోహిత్‌రెడ్డితో కలిసి సొంత పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. తిరిగి సాయంత్రం కర్నూలు నుంచి తన స్వగ్రామానికి కారులో వస్తున్న క్రమంలో మండ లంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీ వద్ద రహదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో పక్కనే ఉన్న గుట్టపైకి కారు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ ధర్మారెడ్డికి తీవ్ర గాయాలు కాగా కుమారుడు రోహిత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ధర్మారెడ్డిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

మిడుతూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండలంలోని సర్పంచులకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు, బుక్ కీపర్లకు శనివారం శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యలయంలో ఎంపీడీవో దశరథరామయ్య, ఈవోఆర్డీ సంజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వనరుల సమీకరణ, వచ్చిన నిధులకు ప్రాముఖ్యత కలిగిన పనులకు ఖర్చు పెట్టుట గ్రామంలో వివిధ రంగాల్లో ప్రజలను చైతన్య పరుచుట, బాల్య వివాహాలు జరుగకుండా తీసుకోవలసిన చర్యలు, గ్రామంలో సుస్థిర అభివృద్ధి ప్రణాలికను రూపొందించుకోవడం కోసం శిక్షణ ఇచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులను నిర్వహించారు. శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్, అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపిపి సరోజినీ వర్ధినీయా, పంచాయతీరాజ్ అధికారి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: గ్రామాల అభ్యున్నతికి ప్రణాళికలే మూలాధారం అని ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. శనివారం నంద్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2025-26 వసంవత్సరానికి గానూ గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల నివేధికలను రూపొందించ డానికి విధి విదానాలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఎంపీడీవో మాట్లడుతూ ప్రణాళికలు రూపొందించుకునే సమయంలో గ్రామాల ప్రాధాన్యత అవసరాలను బట్టి తయారు చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాదించవచ్చునని పేర్కొన్నారు. శిక్షకులుగా ఎంపిడీవో సుగుణశ్రీ, ఈవోఆర్‌డీ శివనాగజ్యోతి వ్యవహరించారు. ఈకార్యక్రమంలో మండల పరిదిలోని సర్పంచ్‌లు, మండల స్థాయి ప్రజా ప్రతినిదులు, అధికారులు, గ్రామైక్య సంఘ లీడర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాగు నిర్మాణానికి ప్రతిపాదనలు

కొత్తపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం శివపురం, లింగాల గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేశారు. ఈ గ్రీవెన్స్ డేలో సీపీఎం నాయకులు ఎమ్మెల్యేకు ఎద్దులేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎన్‌హెచ్ 167 కే ఏఈ రవికాంత్‌ను వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రతి పాదనలు పంపాలని కోరారు. వీటిపై శనివారం ఏఈ రవికాంత్ స్థానిక సీపీఎం నాయకులతో కలిసి ఎద్దులేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రాముఖ్యతను పరిశీలించారు. వీటి నిర్మాణికి 3.40 కోట్ల నిధులకై ప్రతి పాదనలు పంపిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం

పాణ్యం: పాణ్యం, బనగానపల్లె రోడ్డులోని వద్దెలవాగు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే వినతి మేరకు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారన్నారు. పాణ్యం సమీపంలో ప్రమాదకరంగా మారిన వద్దెలవాగు వంతెన నిర్మాణానికి స్థానిక ప్రజలు, వాహనదారులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారన్నారు. ఈ మేరకు మంత్రికి ఎమ్మెల్యే తరపున కృతజ్ఞతలు తెలిపారు.

9న భగవద్గీత పోటీలు

నంద్యాల కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో డిసెంబరు 9వ తేదీన సోమవారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శ్రీకృష్ణ మందిరం అధ్యక్షుడు పార్థసారధికృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రస్వామి తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ 6 అధ్యాయము ఆత్మ సంయమయోగంపై (ధ్యానయోగం)6-7తరగతులకు ఒక విభాగంగా, అదే విధంగా భగవద్గీత 18 అధ్యాయాలలోని 701శ్లోకాలు కంఠస్థం చేసిన వారికి 18 సంవత్సరాల లోపు వారికి ఒక విభాగంగా, 18 సంవత్సరాలు పైబడిన వారికి వేరువేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు విభాగాలకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు నగదు రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణమందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9059802265, 9441008677 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'రోడ్డుకు అనుమతులు లేవు'

మహానంది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానానికి చెందిన మాన్యం భూముల్లో నుంచి ఇతరుల పొలాలకు రహదారి ఇవ్వడానికి తమకు అనుమతులు లేవని మండల తహసీల్దార్ రమాదేవి తెలిపారు. శనివారం మహానంది ఆలయానికి చెందిన మాన్యం భూమి నుంచి తనకు రస్తా కావాలని జయరామనాయుడు అనే వ్యక్తి రెవిన్యూ అధికారులకు ధరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా మండల రెవెన్యూ సర్వేయర్ రఫీ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయానికి అత్యంత సమీపంలోని మాన్యం భూమిలో సర్వే పక్రియ నిర్వహిస్తుండగా మహానందితో పాటు మండలానికి చెందిన కొంతమంది వ్యక్తులు అడ్డుకొన్నారు. ఆలయానికి చెందిన మాన్యం భూమిలో రహదారి ఇవ్వడానికి అనుమతులు ఎలా ఇస్తారని అడ్డుకొన్నారు. దీంతో పొలందారుని తరుపున వచ్చిన నంద్యాలకు చెందిన జిల్లెల శ్రీరాములుకు ఆలయ అధికారుల మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. చివరికి అక్కడికి చేరుకొన్న మండల తహసీల్దార్ రమాదేవి రెవెన్యూ ప్రకారం ల్యాండ్ మ్యాప్‌ను పరిశీలించారు. మహానంది శివారు ప్రాంతంలోని మరో చోటు నుంచి బండ్ల రస్తా మార్గం ముంది. అక్కడి నుంచి సర్వే జరపాలని సర్వే సిబ్బందికి తెలపడంతో వ్యవహారం సద్దుమణిగింది. ఆర్ఐ వెంకట సుబ్బారావు, ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది నాగమల్లయ్య, నీలకంఠరాజు, మల్లిఖార్జునయ్య, సాంబిరెడ్డి, గంగిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

నంద్యాల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం మంచినీటి నిర్వహణ, ఓడీఎఫ్ ప్లస్, ఘణ, ద్రవ్య వ్యర్థాల రీసైక్లింగ్, జల్‌జీవన్ మిషన్, సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిసరాల పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నీరు, గాలి, పరిశుభ్రత, మనుషుల అవసరాలపై మరింత దృష్టి సారిద్దామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు.

పంటకోత ప్రయోగం

జూపాడుబంగ్లా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండ్లెం, తంగడంచ గ్రామంలో శనివారం మొక్కజొన్న పంటపై పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రణాళికా అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు. మండ్లెం గ్రామంలో 5 ఇంటు 5 చదరపు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయగా 28.770 గ్రాములు, తంగడంచ గ్రామంలో 15.660 గ్రాములు దిగుబడి వచ్చినట్లు వేణుగోపాల్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న వర్షమాపక కేంద్రాన్ని పరిశీలించారు. ఏఎస్‌వో హనుమంతు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్లు

- పనులను మధ్యలోనే ఆపేసిన కాంట్రాక్టర్
- పారుమంచాల - రోళ్లపాడు ప్రజల అవస్థలు



అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు



కంకర రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

జూపాడుబంగ్లా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల నుంచి రోళ్లపాడు వరకు ఏడు కిలోమీటర్లమేర బీటీ రహదారి నిర్మాణం ఇష్టారాజ్యంగా మారింది. నాబార్డు నిధులు రూ.5 కోట్లతో ఏడాది క్రితం చేపట్టిన పనులు కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు చేయకుండా ఆపేశారు. పారుమంచాల గ్రామంలో ప్రారంభించిన రహదారిపై కల్వర్టు స్లాబ్ వేయకుండా సగంలోనే వదిలేయడంతో రహదారి లేకుండా చేశారు. వాహనదారులు పొలాల్లో అడ్డంగా పోతున్నారు. కంకర నాలుగు కిలోమీటర్లు కూడా వేయకుండా వదిలేయడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. వేసిన కంకర కూడా రోలింగ్‌లేకపోవడంతో గుంతలు పడటంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు, రైతులు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు కూడా వచ్చే ఏడాది మార్చి వరకే ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసిన పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ విషయమై పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ రామమోహన్ 3.3 కిలోమీటర్ల మేర కంకరవేసి వదిలేశారని చెప్పారు. నిధులు లేక, బిల్లులు రావడం లేదని, దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్లు చెప్పారు. ఇటీవల కొత్తగా విదుల్లో చేరానని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

'తాగునీటి సమస్య పరిష్కరించాలి'

నందికొట్కూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బేబికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లోని మోటారు మరమ్మతుకు గురై 15 రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎస్ఎస్ఆర్ నగర్‌తో పాటు పట్టణంలోని జగనన్న కాలనీలో రెండు మోటార్లు మినహా మిగిలిన మొత్తం మోటార్లు మరమ్మతులకు గురైనట్లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. మరమ్మతులకు గురైన మోటార్లను తక్షణమే రిపేరు చేయించి ప్రజలకు మినీ ట్యాంకుల ద్వారా నీళ్లు అందించాలని కోరారు.

'సారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు'

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సారా తయారీకి బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆత్మకూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆత్మకూరు పట్టణంలో బెల్లం విక్రయించే హోల్‌సేల్ వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రత్యేకించి హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచుకుని ప్రతివారం తమకు అందజేయాలని ఆదేశించారు.

రెండు కేసులు నమోదు: కొట్టాలచెరువు గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కిశోర్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను నేలపాలు చేయడంతో పాటు సారా తయారీకి వినియోగించిన సామగ్రిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కురుకుంద గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ, వెంకటరమణ, బాదుల్లా, కృష్ణుడు, సత్యనారాయణ, రాజు, తిక్కయ్య తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

- ఉమ్మడి జిల్లా గ్రంథాలయాధికారి కె.ప్రకాష్
- గాడిచెర్ల వంశస్థులకు సన్మానం



గాడిచర్ల వంశస్థులను సత్కరిస్తున్న గ్రంథాలయాధికారి

పాణ్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయాధికారి కె.ప్రకాష్ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం ఆయన పాణ్యం గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమ కారులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిం చారు. గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంశస్థుడు గాడిచర్ల మాధవరావు, జానకి దంపతులను పాణ్యం గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లాగ్రంథాలయ అధికారి ప్రకాష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ కమలాకర్, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటు

పాములపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాములపాడు లోని బీసీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి నూతన పైపులైన్ ఏర్పాటుకు సర్పంచ్ మేకల భాగ్యమ్మ పనులను ప్రారంబించారు. అలాగే ఆర్థిక సంఘం నిధులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను బిసి కాలనీలో ప్రారంబించారు.

ఆలిండియా సౌత్ జోన్ క్రీడా పోటీలకు ఎంపిక

పాణ్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈఎస్ఈ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, హుశేన ఆలిండియా సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పులిమెందుల జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూఏ జట్టు ఎంపిక పోటీలలో విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు 2025 ఫిబ్రవరిలో తమిళనాడు సేలం జిల్లా పెరియార్ యూనివర్శిటీలో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. క్రీడలకు ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, పీడీ చంద్రారెడ్డి, హెచ్‌వోడీ ఫారూక్ అభినందించారు.

'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

పగిడ్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. పగిడ్యాల పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ. 5లక్షలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 3 సెంట్లు, పట్టణ ప్రాతాలవారికి 2 సెంట్లు స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముర్తుజావలి, అబ్దుల్ రెహమాన్, రజిత ఉన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు హాల్ నందు పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనంత వరకు రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించాలని సూచించారు. ప్రత్యేకించి క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు, మున్సిపల్ ప్రాపర్టీ టాక్స్, బిల్డింగ్ ప్లాన్స్, కుటుంబ తగాదాలు, 10లీటర్లలోపు నాటుసారా కేసులు తదితర కేసులను ఇరుపక్షాల రాజీపూర్వక అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన

మిడుతూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మిడుతూరు సామాజిక ఆరోగ్య కేద్రంలో నవజాతి శిశు వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, నవజాతి శిశువులకు వచ్చే ప్రమాదకరమైన రోగాల గురించి డాక్టర్ తిరుపతి, డాక్టర్ శారద శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. నర్సింగ్ ఆఫీసర్ ముర్తుజావలి, రామతులసి, సువేద, మహిళలు పాల్గొన్నారు.

19 నుంచి ఉచిత శిక్షణ

నంద్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19 నుంచి ఎంఐఎస్ డేటా అనలిస్ట్‌పై ఉచిత శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.శశికళ శనివారం తెలిపారు. ఇంటర్ ఆపై విద్యనభ్యసించిన శిక్షణకు అర్హులని చెప్పారు. కోర్సు పూర్తిచేసినవారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్ ఇస్తారని, శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణకు అర్హులైన యువతీ,యువకులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9182217075, 8297812530నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

'పది' పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి: డీఈవో



హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

నందికొట్కూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. నందికొట్కూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతపేటలోని ఉర్దూ బాలికల పాఠశాలలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ పాఠశాలలకు మంజూరు అయినటువంటి తరగతి గదుల భవన నిర్మాణం పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఈ సారి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని అందుకు తగిన విధంగా యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మండల విద్యాశాఖ అధికారి సుభాన్ హాజరయ్యారు.

డీఈవోకు విద్యార్థి సంఘాల ఫిర్యాదు

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గత పది రోజులుగా కోడిగుడ్లు మాయమవుతున్నాయని ఆంధ్ర విద్యార్థి సంఘం, ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య నాయకులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులతో మాట్లాడి సమస్య గురించి తెలుసుకొని పరిష్కరిస్తామని డీఈవో విద్యార్థి సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. డీఈవోకు వినతిపత్రం సమర్పించిన వారిలో విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, కుమార్ మహేష్, రాజు, విక్రమ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి'

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు జరిగి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 12, 13 తేదీల్లో నిర్వహించే స్వర్ణోత్సవాలను కళాశాల అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు, పురప్రముఖులు విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలో 1974లో ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇప్పటివరకు ఎంతో మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తుచేశారు. కళాశాల ఏర్పాటై 50వసంతాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు, పురప్రముఖులు భాగస్వాములై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

'రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి'

నంద్యాల క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పోలీసులు అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాలలోని చామకాల్వ వద్ద గల శ్రీచైతన్య స్కూల్‌లో సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్‌బాబు, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా రోడ్ సేఫ్టీ ఈజ్ కమ్యూనిటీ కన్సర్ అనే నినాదంతో రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో చామకాల్వ నుంచి మునిసిపల్ ఆఫీస్ వరకు స్పీడ్ థ్రిల్ బట్ ఇట్ కిల్స్, సేఫ్టీ స్పీడ్ నెక్ట్స్ అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. శ్రీచైతన్య స్కూల్ విద్యాసంస్థల ఏజీఎం సురేష్, ఆర్ఐ కోటయ్య, ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి, బాబుచౌదరి, వీబీరిబ్కా, ప్రసాద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం ఏమైనట్లు..?'

మిడుతూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలంలోని ఖాజిపేట గ్రామంలో పట్టుకున్న 20 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం ఏమయ్యాయని చింతలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రమణరెడ్డి తహసీల్దార్ శ్రీనివాసులును శనివారం ప్రశ్నించారు. ఈ నెల 14న ఒక రేషన్ డీలరు ఆటోలో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు స్పందించి స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. దీనికి సంబంధించి ప్రస్తుతం పట్టుకున్న రేషన్ బియ్యం, రేషన్ తరలించిన ఆటో పోలీస్ స్టేషన్‌లో లేదని ఆయన తెలిపారు. ఈ అక్రమ రేషన్ బాయ్యం గురించి తమ దృష్టికి రాలేదని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రమణ రెడ్డి మాట్లాడుతూ చౌక దుకాణాల ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని దానిని, గాడిలో పెట్టాల్సిన బాధ్యత తహసీల్దార్‌పై ఉందని అన్నారు. ఆ వ్యవస్థపై నిర్లక్ష్యం వహిస్తే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్‌కు చెప్పారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, లింగాల గ్రామాల మధ్యలో శనివారం ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి మోటర్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయయాలయ్యాయి. లింగాపురం మీదుగా కొత్తపల్లికి వస్తున్న ఓ ట్రాక్టర్‌ను కొత్తపల్లి నుంచి లింగాపురానికి బైక్‌పై వెళుతున్న యువకులు తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. కొత్తపల్లికి చెందిన మన్సూర్ బాషాకు కాళ్లు విరిగిపోయాయి. మద్దూరు గ్రామానాకి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడికి తలకు బలమైన గాయాలయ్యాయి. సమీపంలో ఉన్నవారు 108కు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది హుటాహుటిన వెళ్ళి ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

పిల్లలకు స్క్రీనింగ్ టెస్టు

మిడుతూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలముడిపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రంలో పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు డాక్టర్ మద్దిలేటి నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం వల్ల వారిలో ఉన్న వైకల్యం ఉంటే తెలుసుకుంటారని చెప్పారు. చిన్నచిన్న జబ్బులకు ఇక్కడే పరిష్కరించి, పరిస్కారం కాని జబ్బులు ఉన్న వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు పంపడం జరుగుతుందని డాక్టర్ మద్దిలేటి తెలిపారు. బాల సుబ్బారెడ్డి, కిరన్ కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పడవ పోటీలు ప్రారంభం



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నంద్యాల, నవంబరు 16 : (ఆంధ్రజ్యోతి): జిల్లా కనొయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని చిన్న చెరువులో రాష్ట్ర స్థాయి పడవ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర యువనాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభిం చారు. వారు మాట్లా డుతూ నంద్యాలలో మొట్టమొదటిసారిగా రాష్ట్ర స్థాయి పడవ పోటీలు నంద్యాలలో జరగడం ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడలపై మక్కువ పెరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 9జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారని ఆది వారంతో పోటీలు ముగు స్తాయని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కార్యనిర్వాహక కార్యదర్శి అపర్ణ తెలిపారు.

ఘనంగా ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం, నవంబరు 16 (ఆంధ్రజోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. వారాంతాన్ని పురస్కరించుకుని క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య పెరిగింది. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణను నిర్వహించారు. ఆకాశదీపం కార్యక్రమం శనివారం సాయంత్రం ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం సాయంత్రం గుంటూరుకు చెందిన విజయగౌరి బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, భో... శంభో...శివశంభో తదితర గీతాలకు అదితి, సంజన, పూజిత, వినూత్న, అక్షర, శృతి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. నంద్యాలకు చెందిన సాయినాట్యాంజలి ఫైన్ ఆర్ట్సు డెవలప్‌మెంట్ అసోషియేషన్ బృందం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం ఒంగోలుకు చెందిన మినుమమనూరి శేఖర్ దంపతులు కలిసి రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. అదేవిదంగా హైదరాబాదుకు చెందిన వి. సూర్యాదేవి కుటుంబ సభ్యులతో కలిసి రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు సి. మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, ఏవో

కోవెలకుంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిజినవేముల, వెల్లటూరు గ్రామంలో నేలవాలిన వరి పంటలను శనివారం కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాల కుడు ఎస్‌.సుధాకర్, మండల వ్యవసాయాధికారి నిరంజన్ కలిసి పరిశీలించారు. వర్షానికి నేలకూలిన పంటలను పరిశీలించి జాబితా తయారు చేశారు. పంటనష్టం జాబితాను ఉన్నతాధికారులకు పంపించి రైతులకు పంట నష్టం అందేలా చూస్తామన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో వరి పంట నేలవాలినట్లు ప్రాథమికంగా నిర్ధారించి రిపోర్టు ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

అప్రమత్తం చేయాలి: ఏడీఈ

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు, రైతులను విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం చేయాలని ఆళ్లగడ్డ విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరి తెలిపారు. శనివారం చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యుత్ లైన్‌మెన్‌లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏడీఈ మాట్లాడుతూ వర్షాలు పడుతుండటంతో రైతులు విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల వద్ద జాగ్రత్తలు వహించేలా అవగాహన కల్పించాలన్నారు. రూ.10 లక్షల వ్యవసాయ బకాయిలు ఉన్నాయని, విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ తొలగించాలన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే జరిమానాలు విధించాలన్నారు. సమావేశంలో విద్యుత్ ఏఈ షాజహాన్, సబ్ ఇంజనీర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర పారాయణం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా చాగలమర్రిలోని పాత శివాలయంలో శనివారం మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర పారాయణం, సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కార్యదర్శులను కించపరచడం తగదు'

శిరివెళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులను కించపరిచేలా కలెక్టర్ వ్యాఖ్యలు చేయడం తగదని కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్పకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ, కార్యదర్శులు రవి శంకర్, వెంకట రమణ, జ్యోతి, షరీఫాభాను,

20 నుంచి డేటా అనలిస్ట్ శిక్షణా తరగతులు

శిరివెళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20 నుంచి డేటా అనలిస్ట్ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వివరాలను కళాశాలలో నమోదు చేయించుకోవాలని ప్రిన్సి పాల్ తెలిపారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. శనివారం చాగలమర్రి గాంధీ బజారులో టీడీపీ సభ్యత్వ నమోదు అవగాహన కల్పించారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు శంకరసుబ్బారావు, సత్యనారాయణ, మహబూబ్‌బాష, ఓబులేసు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: టీడీపీ అధిష్ఠానం సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని టీడీపీ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని షాదీఖానాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్షా నిర్వహించారు. నాయకులు రాజా నారాయణ మూర్తి, వై లక్ష్మినారాయణయాదవ్, టి.శ్రీనివాసులు, మోపూరి రామక్రిష్ణ, ఖాజావీర్, రామ్మోహన్‌యాదవ్, మధుకుమార్,. అలేబాదు పరమేష్ శంకర్, సూర్యనారాయణగౌడు తదితరులు పాల్గొన్నారు.

డోన్: ప్రజల మేలు చేసేలా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ అన్నారు. శనివారం మండలంలోని వలసల గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వలసల బాలుడు, సుధాకర్ పాల్గొన్నారు.

'నారా రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం'

అవుకు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు (72) మృతి బాధాకరమని అవుకు టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధరరెడ్డి, ఉగ్రసేనారెడ్డి, మొట్ల రామిరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, ఎస్ రామకృష్ణారెడ్డి, మారం పుల్లారెడ్డి, వెంకటరమణనాయక్, తిక్కన్న, దంతెల రమణ పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాత ఆలయంలో హుండీ లెక్కింపు

బనగానపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శనివారం హుండీని లెక్కిం చారు. మొత్తం ఆలయానికి మూడు నెలలకుగాను రూ.18,27,724 ఆదాయం లభించినట్లు ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్యాపిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలేబాదు తండా సమీపంలో నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. సుమారు వందలీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కర్రెవలేనాయక్, బోడేనాయక్‌ను అరెస్టు చేసి నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ సీఐ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



కంది కళకళ

- జిల్లాలో 43 వేల హెక్టార్లలో సాగు
- ఈ ఏడాది అనూహ్యంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- ఆశాజనకంగా మార్కెట్లో ధర
- అన్నీ అనుకూలిస్తే రైతన్న పంట పండినట్లే


పూత దశలో ఉన్న కంది పంట

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులు విస్తారంగా సాగు చేసిన కంది పంట ప్రస్తుతం కళ కళ లాడుతోంది. అదునుకు వర్షాలు కురవడం, వాతావరణం అనుకూలించడంతో కంది పంట రైతన్నలకు ఆశాజనకంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న, పత్తి, మినుము, వేరుశనగ తదితర అనేక పంటలు అతివృష్టి, అనావృష్టి కారణంగా దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే కంది పంట మాత్రం కళ కళలాడుతూ రైతుల్లో సరి కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. గతంలో ఎన్న డూలేని విధంగా కంది పంట ఏపు గా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో పూత, పిందె దశలో ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో మొగ్గ దశలో కంది పంట కళ కళలాడుతోంది. మరోవైపు ఈ ఏడాది కంది సా గుపై రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి కనబర చడంతో జిల్లాలో కంది సాగు అనూహ్యంగా పెరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నంద్యాల జిల్లాలో కంది సాధారణ సాగు విస్తీర్ణం 37,545 హెక్టార్లు కాగా, అంతకు మించి, రైతులు 43,000 హెక్టార్లలో సాగు చేయడం గమనార్హం. సాగుకు ఖర్చు కాస్త తక్కు వగా ఉండటం,వర్షాభావ, బెట్ట పరిస్థితులను తట్టుకునే స్వభావం కందికి ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు ఈ ఏడాది కంది పంట వైపు మొగ్గు చూపినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం కంది పంట ధర మాత్రం మార్కెట్లో ఆశాజనకంగా ఉండటం కంది సాగు చేసిన రైతులకు కలి సొచ్చే అంశంగా మారింది. ప్రస్తుతం కంది క్వింటాల్‌కు రూ.10 వేల వరకు పలుకుతోంది. మరి కొద్ది రోజులు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడి వచ్చి కంది రైతులకు పంట పండినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో 43వేల హెక్టార్లలో విస్తారంగా కంది సాగైంది. కం ది పంట ప్రస్తుతం పూత దశకు చేరుకున్నందున రైతు లు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

కొనసాగుతున్న కార్తీక మాస పూజలు

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో కార్తీక మాసం పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో వెలసిన గుండం అభయాంజనేయస్వామి, అంకిరెడ్డిపల్లె అంజనేయ స్వామి ఆలయాలతో పాటు కొలిమిగుండ్ల మండ కేంద్రంలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలోనూ భక్తులు పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి, అభిషేకాలు నిర్వహించారు.

ప్యాపిలి: కార్తీక మాసం రెండవ శనివారం పట్టణంలోని ఆంజినేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలించారు.


పూజలందుకుంటున్న గుండం ఆంజనేయస్వామి


ప్యాపిలి ఆంజనేయస్వామి ఆలయంలో..

తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం

రుద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి నరసాపురం, ఆలమూరు, ముత్తలూరు, రుద్రవరం, కొండమాయపల్లె పలు గ్రామాల్లో వరి ధాన్యం తడిచి ముద్దయింది. వరి పంట నేలవాలింది. మొక్కజొన్నలు తడిచిపోయాయి, రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి 3 మీ.మీ వర్షపాతం నమోదైంది. రహదారుల్లో ఆరబెట్టుకుంటున్న మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరారు.


రుద్రవరం మండలం నరసాపురంలో నేలవాలిన వరి పంట

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

బనగానపల్లె , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని టంగుటూరు వైద్యశాల డాక్టర్ శివశంకరుడు అన్నారు. శనివారం బనగానపల్లె మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు పౌష్టికాహారలోపం, రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శేఖర్, రమేశ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

24 గంటల త్రీఫేస్ కరెంట్ ఇవ్వడమే లక్ష్యం: ఈఈ

ఉయ్యాలవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా అందించటమే ఆర్‌డీఎస్‌ఎస్ లక్ష్యమని విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మూడు నుంచి నాలుగు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఆయన వెంట ఏఈ క్రిష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

'ప్రతి పేదోడికి ఇంటి స్థలం ఇవ్వాలి'

సంజామల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదోడికి ఇంటి స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అబ్రహాం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గిద్దలూరులోని చీమల దిబ్బ ప్రాంతంలో నివశించే యానాదులతో ఆయన సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ రాఘవ, గంగన్న, ఓబులమ్మ, ఆనందమ్మ, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

11 వేల గృహాలకు జియో ట్యాగింగ్ పూర్తి

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు 11వేల గృహాలు జియో ట్యాగింగ్ సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి శనివారం వెల్లడించారు. ప్రభుత్వం ఆదేశాలమేరకు సర్వే వేగవంతంగా చేపడుతున్నామని, మండలంలో మొత్తం 16వేల గృహాలు ఉన్నాయన్నారు. 11వేల గృహాల సర్వే పూర్తయిందని, మరో రెండు రోజుల్లో జియో ట్యాగింగ్ సర్వే పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయినిపల్లె గ్రామంలో కుమారి అనే మహిళపై దాడి చేసిన రామక్రిష్ణారెడ్డితో పాటు ముగ్గురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శనివారం వెల్లడించారు. ఇంటి వద్ద డ్రైనేజీ విషయంలో గొడవ పడి దాడి చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాదాస్పద రహదారుల పరిశీలన

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో పొలాలకు వెళ్లే వివాదాస్పద రహదారులను జిల్లా సర్వేయర్ల ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ శనివారం పరిశీలించారు. 219, 220, 221, 222 సర్వే నంబర్ల పొలాల వద్దగల రహదారులను సర్వే చేశారు. రహదారుల సమస్యలు ఉన్న రైతులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, మండల సర్వేయర్ మద్దిలేటి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

శిరివెళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు శిరివెళ్ల పోలీసులు శనివారం తెలిపారు. వీరి నుంచి రూ.1.22 లక్షలు నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పార్టీకి సీనియర్ల సేవలు అవసరం

డోన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీకి సీనియర్ల సేవలు ఎంతో అవసరమని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం కడపలో సీనియర్ టీడీపీ నాయకుడు పుత్తా నరసింహారెడ్డితో పాటు పలువురి నాయకులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.


కడపలో పుత్తా నరసింహారెడ్డిని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి


కమణీయం.. శివపార్వతుల కల్యాణం


భైరవ క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవగుండాల క్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో నాగేంద్రకుమార్, బాబు దంపతులచే నిర్వహించారు. ఈ కల్యాణం అత్యంత కమణీయంగా సాగింది. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో విశ్వశాంతి గాయత్రీ హోమం, పూర్ణాహుతి, శివపార్వతుల పల్లకి ఉత్సవం చేశారు. చింతలచెరువు వినాయక గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన కోలాట నృత్యం అందరిని ఆకట్టుకుంది. మహిళలు అఖండజ్యోతులతో తెలుగు గంగ జలాశయంలో వదిలి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు

శిరివెళ్ల, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలో స్వయంభువుగా కొలువైన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నారసింహుడికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ గర్భ గుడిలోని నరసింహ స్వామి మూలవిరాట్‌కు అర్చకులు వేకువ జామునే అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. నంద్యాల, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రంగనాయకులు స్వామి, పవన్ కుమార్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న సర్వలక్ష్మీ నరసింహ స్వామి

హైందవ ధర్మాన్ని కాపాడాలి

శిరివెళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వైవి రామయ్య అన్నారు. మండలంలోని గోవిందపల్లెలో గోవిందానంద ఆశ్రమంలో శనివారం సమావేశం నిర్వహించారు. జనవరి 5, 2025న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి హిందూవులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు రాము, విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు కమతం రాజశేఖర్‌రెడ్డి, నడిపి సుబ్బారెడ్డి, చంద్ర, నాగమల్లేశ్వర్‌రెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైవీ రామయ్య

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

దొర్నిపాడు,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోని, భవ్య శ్రీ జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపా ధ్యాయురాలు ఆదిలక్ష్మ మ్మ తెలి పారు. శనివారం క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు సోని, భవ్యశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యా ర్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, నాగరాజు, గంగాధర్, సురేష్, మధు ఉన్నారు.


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

- వరప్రసాద్, ఏడీ, పశుసంవర్ధక శాఖ



చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పాడి పరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. పశువుల వ్యాధుల నివారణే లక్ష్యమన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారా?

జవాబు: 19 గ్రామ పంచాయతీల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశాం. 11,500 గేదెలు, ఆవులకు టీకాలు వేసి అవగాహన కల్పించాం.

ప్రశ్న: పాడిరైతులకు ఎన్ని మెట్రిక్ టన్నుల దాణ ఇచ్చారు?

జవాబు: 75 శాతం సబ్సిడీతో 16 మెట్రిక్ టన్నుల దాణ పంపిణీ చేశాం. ముందుగా నగదు చెల్లించిన వారికి దాణ సరఫరా చేశాం.

ప్రశ్న: మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు: మండలానికి 35 మినీ గోకులాలు మంజూరయ్యాయి. మినీ గోకులం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు రూ.2.30లక్షలు నిధులు ఉపాధి హామీ ద్వారా ఖర్చు చేయబడుతుంది. 10శాతం రైతు వాటా చెల్లించాల్సి ఉంది. లబ్ధిదారులు షెడ్డు నిర్మించుకునే స్థలాలను పరిశీలించి మినీ గోకులం ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నాం.

ప్రశ్న: పశుగణన సక్రమంగా జరుగుతోందా?

జవాబు: గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పశుగణన కార్యక్రమం పక్బందిగా నిర్వహిస్తున్నాం. 11 మంది ఎన్యూమరేటర్లచే సర్వే చేస్తున్నాం. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశుగణనతో పాటు కుక్కలు, గాడిదలను కూడా నమోదు చేస్తారు. ఫిబ్రవరి చివరి వరకు పశుగణన కొనసాగుతుంది.

ప్రశ్న: కృత్రిమ గర్భాదారణ పథకం నిర్వహిస్తున్నారా?

జవాబు: కృత్రిమ గర్భాదారణ పథకం పాడి రైతులకు లాభదాయకమని పథకాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. 19 గ్రామాల్లో మేలుజాతి లక్షణాలతో ఉన్న పశువుల వీర్యాన్ని సేకరించి తరువాత కృత్రిమ గర్భాదారణకు ఉపయోగిస్తున్నాం. ఎదకు వచ్చిన 4,900 గేదెలకు సూదులు వేశాం. పశుగ్రాసం కత్తిరించేందుకు చాఫ్‌కట్టర్ యంత్రం మంజూరైందని, 40 శాతం సబ్సిడీతో పాడిరైతులకు పంపిణీ చేస్తున్నాం.

సీఎం సోదరుడి మృతికి మంత్రి బీసీ సంతాపం

బనగానపల్లె , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతికి రోడ్లుభవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రామ్మూర్తినాయుడు మృతి చెందడం బాధాకరమన్నారు. రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులకు బీసీ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజారవాణా సమస్యలపై ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం12 వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏవైనా సమస్యలు, ఫిర్యాదులను ఉంటే సెల్ నెంబరు 9959225798కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

ఉయ్యాలవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పొందాలంటే వ్యక్తిగత ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పని సరిగా చేయించుకోవాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు అన్నారు. శనివారం పోస్టల్ అధికారులతో కలిసి ఉయ్యాలవాడ గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, ఉయ్యాలవాడ ఎస్పీఎం గురువయ్య, ఎంవోలు భాస్కర్‌వావు, పెద్దరాజు, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి ఉన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

రుద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో వనరులను బట్టి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, వార్డుమెంబర్లకు పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో శిక్షకులు షాహినూర్ ఎ.పాములేటి, శివకృష్ణ, ఎంపీపీ బాల స్వామి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, పంచాయతీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూ పొందించాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పొదుపు లీడర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిక్రిష్ణ, పశువైద్యాధికారి, ఈవోఆర్డీ, వైఎస్ ఎంపీపీ క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించుకోవాలి

రుద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యాధికారి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలపై అవగాహన కల్పించారు. టీకాలు వేయిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. సమావేశంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన మహిళల వివరాలను సేకరించి క్యాన్సర్ వ్యాధిలో మూడు లక్షణాలపై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 10 వేల కుటుంబాలకు సర్వే చేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందజేశామన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండలంలోని పెద్దబోదనం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. జీయోట్యాగ్ సర్వేను పరిశీలించి వేగవంతం చేయాలని అన్నారు. ఆయన వెంట పీఆర్ ఏఈ కొండారెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ పూజలు

కోవెలకుంట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో వెలసిన సత్యనారాయణస్వామి దేవాలయంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా విగ్రహ మూర్తులను వీధుల గుండా ఊరేగించారు. అనంతరం సాయంత్రం కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం విగ్రహమూర్తులను ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.